క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంను సద్వినియోగించుకోండి

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినుకొండ ఆర్టీసీ డీఎం జె.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో ఉన్న ప్రజలు తమ ఫిర్యాదులు, సలహాలు, సూచనలు తెలియజేయగలరని తెలిపారు. డిపో పరిధిలో పట్టణం, గ్రామాల నుండి సమయ వేళల్లో మార్పులు, సర్వీసులకు సంబంధించి ప్రయాణీకులు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు 9959225431 నంబరును సంప్రదించి తెలియజేవచ్చన్నారు.

పుస్తకావిష్కరణ సభ

యడ్లపాడు: కామ్రేడ్ కాళిదాసు అభినందన సంచిక ఆవిష్కరణ సభ ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ తెలిపింది. గుంటూరు నగరంలోని ఎన్జీవో కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఒంగోలుకు చెందిన నల్లూరి వెంకటేశ్వర్లు, రంగస్థల, సినీ నటులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, ఖమ్మంకు చెందిన ప్రజాకవి కొత్తూరు దేవేంద్ర, ఆంధ్ర ప్రజా నాట్యమండలి పూర్వ కార్యదర్శి కె.శాంతారావు, ప్రజాగాయకుడు పీవీ రమణ హాజరుకానున్నట్లు వెల్లడించారు.

ఫిర్యాదిదారులతో మర్యాదగా వ్యవహరించాలి

నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు



నాదెండ్ల: ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలని నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు చెప్పారు. నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్సై జి పుల్లారావులతో మాట్లాడి పెండింగ్ కేసులు, ప్రస్తుత కేసులపై విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, వర్గాల మధ్య ఘర్షణల నివారణకు నిరంతరం ప్రయత్నించాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాలు, బెల్టుషాపుల నియంత్రణకు ఎప్పటికప్పుడు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

వైద్యరంగంలో నర్సింగ్ కీలకపాత్ర



నరసరావుపేట ఈస్ట్: రోగుల ఆరోగ్య పరిరక్షణలో నర్సింగ్ విభాగానిది కీలకపాత్ర అని వక్తలు పేర్కొన్నారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ నర్సింగ్ కళాశాలలో గురువారం శస్త్ర చికిత్స నిర్వహణకు ముందు, తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ, శస్త్ర చికిత్స (ఆపరేషన్) సమయంలో రోగిని సిద్ధం చేయటం మొదలుకొని సదరు రోగి ఆరోగ్యం చేకూరి ఇంటికి క్షేమంగా వెళ్లే వరకు నర్సులు గురుతర బాధ్యతలు నిర్వహిస్తారని వివరించారు. వర్క్‌షాప్‌లో భాగంగా నర్సింగ్ విభాగం ప్రిన్సిపల్ కె.ఎం.రేణుకాదేవి, రిసోర్స్ పర్సన్ సి.హెచ్.ధనలక్ష్మీ విద్యార్థులకు శస్త్రచికిత్స సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ఏ.వి.ఎన్.గుప్త, అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టణంలో మంచినీటి నాణ్యత పరీక్షలు



వినుకొండ(నూజెండ్ల): ప్రజారోగ్యమే ధ్యేయంగా నీటి ద్వారా సక్రమించే వ్యాధులను నివారించడానికి నీటి నాణ్యతను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచన మేరకు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. అమెనిటీస్ కార్యదర్శులు ఉదయాన్నే నీరు సరఫరా చేసే సమయంలో రెసిడ్యుయల్ క్లోరిన్ పరీక్షలు నిర్వహించి నీటిలో ఎలాంటి కలుషితాలు లేవని నిర్ధారించుకున్నాకే నీటిని పంపిణీ చేసేలా మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. పంప్ హౌస్ వద్ద ఈఎల్ఎస్ఆర్‌ల వద్ద పంపిణీ చేయు వాల్వులలో సబ్మెర్జడ్ పైపులలోను అపరిశుభ్రతకు తావులేకుండా చూసుకోవాలని, క్రమం తప్పకుండా నీటి పరీక్షలు జరిపి నివేదికలను కార్యాలయానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

కొలువొచ్చింది!



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ నందు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 3 కంపెనీలు హాజరుగా 76మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 33మందిని ఎంపిక చేశారని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. - వినుకొండ(నూజెండ్ల)

అన్నదాతా..



గణపవరం తులసీవనం వృద్ధాశ్రమంలో గురువారం బీజేపీ నాయకులు అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ ఓబీసీ ఉపాధ్యక్షులు అన్నం శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో ఒకరోజు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.పుల్లయ్య, అన్నపరెడ్డి లక్ష్మణ్, పోతవరం సుభాని, గుమ్మా బాలకృష్ణ, ఎ.వెంకటేశ్వరరావు, కె కళ్యాణ్‌దుర్గారావు, జోలాపురం రాముడు, సాల్మన్ ఉన్నారు. -నాదెండ్ల

సమస్యలతో సతమతం



గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి బెజవాడ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వినుకొండ పట్టణంలోని గిరిజన సంక్షేమ పాఠశాలకు వెళ్లిన నాయకులు సంక్షేమ పాఠశాలల్లోని సమస్యలను తెలుసుకున్నారు. సరస్వతి, సాంబశివరావు, ఎంఎస్ రావు, వసంతరావు, చంద్రశేఖర్, శ్రీకృష్ణ పాల్గొన్నారు. -వినుకొండ(నూజెండ్ల)

సర్వేంద్రియానం...



పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యవిషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు చెప్పారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన డాక్టర్ అగర్వాల్ ఐకేర్ ఆసుపత్రి సౌజన్యంతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పట్టణంలోని శానటరీ ఆఫీసులో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 282 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. 11 మందిని చుక్కల ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. -చిలకలూరిపేట

అడుగుకో గుంత – తీరేదెలా చింత!

- గోతులమయంగా గణపవరం-నాదెండ్ల డొంక
- లక్షలు ఖర్చు చేసినా పూర్తికాని ప్యాచ్‌వర్క్ పనులు
- అసహనం వ్యక్తం చేస్తున్న వాహనచోదకులు, గ్రామస్తులు



నాదెండ్ల వెళ్లే డొంక రోడ్డులో రోడ్డుపై భారీ గోతులు

నాదెండ్ల: గ్రామాల్లో గుంతలు లేని రోడ్లను ఏర్పాటు చేస్తామంటూ కూటమి నాయకులు పల్లె పండుగ పేరిట చేసిన హడావుడి అంతాఇంతా కాదు. ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించి హంగామా చేశారు. గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డుతో పాటూ పలు గ్రామాల్లో రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని వాహన చోదకులు, స్థానికులు వాపోతున్నారు. గణపవరంలోని శివప్రియనగర్ పెట్రోల్ బంకు నుంచి గణపవరం, నాదెండ్ల మీదుగా జంగాలపల్లె వరకూ ఆర్ అండ్ బీ అధికారులు రూ.40 లక్షల వ్యయంతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. పెట్రోలు బంకు వద్ద జంగాలపల్లె, సంకురాత్రిపాడు గ్రామాల్లో తప్ప మిగిలిన చోట్ల ప్యాచ్‌వర్క్ నిర్వహించక పోవటంపై స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై కూటమి నాయకులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కరాటేలో స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ పి. హేమలత, సిబ్బంది

నరసరావుపేటటౌన్: జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గురువారం బరంపేటలోని పాఠశాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పథకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పి. హేమలత అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్నాటక రాష్ట్రం మంగుళూరు సమీపంలోని పుత్తూరు వద్ద బుడొకన్ కరాటే ఇంటర్నేషనల్ 42 ఎన్ బి కే ఐ నేషనల్ కరాటే చాంపియన్ షిప్-2024 ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు స్వర్ణ పథకం, రజత పథకం కైవసం చేసుకున్నారన్నారు. స్కూల్ కి చెందిన సిరికొండ గౌతమ్ కుమార్, కట మరియు కుమిటే 2 టిలో ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. మరియు సాకి రాజరాజేశ్వరి దేవి, కట. విభాగంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుందన్నారు. ఈ పోటీలకు అన్ని రాష్ట్రాల నుంచి 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టార్ మల్లికార్జునరావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఏ–1 పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీఈఓ



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవటం ద్వారా వారిలో సామర్థ్యాలను పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షా కేంద్రాలను గురువారం డీఈఓ చంద్రకళ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. పట్టణంలోని శ్రీతిలక్ మున్సిపల్ హైస్కూల్, శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ హైస్కూల్, బాలికోన్నత పాఠశాలలను సందర్శించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులను ప్రశ్నించి వారి పురోగతిని తెలుసుకున్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం కావాలి

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి 31వతేదీ వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో అందుకు సన్నద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు డీఈఓ చంద్రకళ సూచించారు. జిల్లా పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని తెలిపారు.

మద్దతు ధర ప్రకటించి ఉత్పత్తులు కొనుగోలు చేయాలి

ఏపీ కౌలు రైతు సంఘ నాయకుల డిమాండ్

నరసరావుపేట: జిల్లాలో రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ప్రకటించి ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రతి రైతు నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామినేని రామారావు, వై.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు మద్దతు ధర ఇవ్వడం ద్వారా రైతాంగం బాగుంటుందని ఉత్సాహంగా పంటలు సాగు చేస్తారని తద్వారా కొనుగోలు శక్తి పెరిగి అన్ని రంగాలు అభివృద్ధి బాటలో ఉంటాయన్నారు. పల్నాడు జిల్లాలో ప్రత్తికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7521లు ఉన్నా తేమ శాతం ఎక్కువ ఉందని, నాణ్యత తక్కువ ఉందని వంకలు చెప్పడంతో పాటు రైతుల కంటే మధ్య దళారులకే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు.

సినీ నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆఫీస్ ముందు జర్నలిస్టుల ఆందోళన
- జర్నలిస్టులపై దాడులను ఖండించిన అసోసియేషన్ నాయకులు



కలెక్టరేట్‌లో ర్యాలీ చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

నరసరావుపేట: హైదరాబాదులో కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టులపై సినీనటుడు మోహన్‌బాబు చేసిన దాడికి నిరసనగా జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం జర్నలిస్టుల జేఏసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహించి జిల్లా అదనపు కలెక్టర్ కుముద్దీన్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ సంఘటనలో టీవీ 9 ప్రతినిధి రంజిత్‌కు తీవ్ర గాయాలయ్యాయన్నారు. దీనికి పాల్పడిన మోహన్‌బాబు క్షమాపణ చెప్పాలని, అతనిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నినాదాలు చేశారు. చట్టాలు చేసే సభకు ఒకసారి ప్రాతినిధ్యం వహించిన మోహన్‌బాబు 70ఏళ్ల వయస్సులో ఈ విధమైన చర్యలకు పాల్పడం హేయమైన చర్య అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జర్నలిస్టుల భద్రతకు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీవీ 9 ప్రసాదు, జర్నలిస్టు సంఘాల నాయకులు సీహెచ్.వి.రమణారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, నాగరాజు, బుచ్చిబాబు, ఎంఐఎం, ప్రజాసంఘాల నాయకులు గోదా రమేష్‌కుమార్, షేక్ కరిముల్లా, మౌలాలి పాల్గొన్నారు.

అతిథిగృహంలో విందు వినోదాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వినుకొండ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైంది. అధికారాన్ని అడ్డంపెట్టుకొని ప్రభుత్వ అతిథి గృహాన్ని కొందరు విందు వినోదాలకు నిలయంగా మార్చారు. వినుకొండ ఎమ్మెల్యే, ఏపీ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు షాడోగా వ్యవహరిస్తున్న వ్యక్తి పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని అతిథి గృహాన్ని విందు, వినోదాలకు కేంద్రంగా మార్చాడు. అతనితో పాటు పట్టణంలోని పాలక, ప్రతిపక్షపార్టీలకు చెందిన కొందరు ప్రముఖులు ఈ విందులో పాల్గొనడం ఆసక్తి కలిగిస్తోంది. వినుకొండ ఎమ్మెల్యే, ఏపీ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు షాడో గా ఉన్న శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణారావు పుట్టినరోజు వేడుకలు బుధవా రం రాత్రి ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జరిగాయి. రాత్రి పసందైన విందు పార్టీతో పాటు పట్టణంలో స్పా మసాజ్ సెంటర్‌కు చెందిన కొందరిని పిలిపించి ఈ ప్రముఖులకు మసాజ్ చేయించినట్లు తెలు స్తుంది. అందరూ కలిసి అర్ధరాత్రి వరకు పూటుగా మద్యం సేవించి విందులో ఆనంద డోలికల్లో మునిగి తేలారు. కేవలం అధికారాన్ని అడ్డంపెట్టుకొని అతిథి గృహాన్ని ఇటువంటి కార్యక్రమాలకు నిలయంగా మార్చారని విమర్శలొచ్చాయి.

నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యం

చిలకలూరిపేటటౌన్: బాలల్లో పఠనాశక్తితో పాటు నైతిక విలువలు పెంపొందించడమే జ్ఞానేశ్వరీ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆశయమని సంస్థ ఉపాధ్యక్షులు గేరా యాకోబు అన్నారు. తెలుగు సాహిత్యానికి అమూల్యమైన సేవలు అందించిన బ్రిటీష్ ఉద్యోగి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వర్ధంతి కార్యక్రమాన్ని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక శ్రీ శారద మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పుస్తక పఠనం, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

అనంతరం పాఠశాల గ్రంథాలయానికి 40 రకాల బాలసాహిత్య పుస్తకాల పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం జనవిజ్ఞాన వేదిక ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డా.దార్ల బుజ్జిబాబు, సంస్థ సభ్యులు వడ్లాన చంద్రం, పానుగుబాటి ఉదయ్ కుమార్, ట్రెజరర్ తలతోటి ఎఫ్రాయిము, కుల్లి రాజా, పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు ఎస్.సత్య వాణి, ఉపాధ్యాయులు పి. షహినజ్, ఎస్కే అయేషా తదితరులు పాల్గొన్నారు

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

యడ్లపాడు: బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన కార్పెంటర్ దారా కోటేశ్వరరావు భార్య ఇద్దరు పిల్లలతో సమీప బంధువుల వివాహానికి గురువారం బైక్‌పై బయలు దేరాడు. ఈ క్రమంలో యడ్లపాడు నుంచి మైదవోలు వెళ్తుండగా సర్వీసు మార్గంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి వాహనంపై ఉన్న అందరూ కిందపడ్డారు. ఈ ప్రమాదంలో కోటేశ్వరావుకు తీవ్రంగానూ, మిగిలిన వారికి స్వల్పగాయాలైనట్లు ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపారు.

దొంగతనమే 'మిక్కిలి' ఇష్టం!

- పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు
- రూ. 4.35 లక్షలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె నాగేశ్వరరావు

చిలకలూరిపేట: పలు దొంగతనాల్లో నేరస్తుడిగా ఉన్న నిందితుడిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరులోని శారదా కాలనీకి చెందిన మిక్కిలి సందీప్‌పై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 23 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. ఇతను ఈ నెల 9వ తేదీన గణపవరం గ్రామ పరిధిలోని విజయవాసవీ దాల్ అండ్ రైస్‌మిల్లులో దొంగతనానికి పాల్పడ్డాడు. రాత్రి సమయంలో మిల్లులోని ఆఫీసులో ఉన్న బీరువా లాకర్ తెరచి అందులోని రూ. 4.35 లక్షలు దోచుకెళ్లాడు. ఉదయం మిల్లు యజమాని ఆఫీసుకు వచ్చి చూడగా బీరువా లాకర్ పగలగొట్టి అందులోని నగదు దోచుకెళ్లడం గుర్తించి నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు నిర్వహించి నిందితుడిని గణపవరం సినిమా హాలు సెంటర్‌లో గురువారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి దొంగతనానికి గురైన రూ. 4.35లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో నాదెండ్ల ఎస్ఐ జి పుల్లారావు, రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఈ సందర్భంగా డీఎస్పీ నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఎక్సైజ్, కస్టమ్స్, విజిలెన్స్ అధికారులమంటూ ప్రజలకు వస్తున్న ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల సరఫరాలో మీ పిల్లలు పట్టుబడ్డారని తల్లి దండ్రులకు, మీ పేరున మాదక ద్రవ్యాలు కొరియర్ వచ్చిందని వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులుగా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ఇలాంటి కాల్స్ వస్తే ఆందోళన చెందకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

నా భూమి ఆక్రమించారయ్యా!

- అధికారులు చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు
- ఎమ్మెల్యేకు విన్నవించిన ములకలూరు రైతు



ఎమ్మెల్యే చదలవాడకు సమస్యను వివరిస్తున్న రైతు శివాజీ

నరసరావుపేట రూరల్: ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేశా.. నా పొలంలో కొంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారు... న్యాయం కోసం కొన్ని నెలలుగా రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదంటూ ములకలూరుకు చెందిన రైతు చింతా శివాజీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎదుట వాపోయాడు. మండలంలోని ములకలూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తన భూమిని ఆక్రమించారని గ్రామానికి చెందిన చింతా శివాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నిసార్లు గ్రామ సర్వేయర్‌ను కలిసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. రెవెన్యూ సిబ్బంది, రియల్ వ్యాపారులతో కుమ్మక్కై తనకు భూమే లేదని చేబుతున్నారని కన్నీళ్ల పర్యంతమయ్యాడు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎంపీడీవో సూర్యకుమారి, ఈవో మాధవిదేవి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో గ్రామసభలకు అర్జీల వెల్లువ



అర్జీ తీసుకుంటున్న తహసీల్దారు రమేష్‌కుమార్



సంకురాత్రిపాడు గ్రామ సభలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ ఏవీ రమణ



రొంపిచర్లలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నిర్మల

యడ్లపాడు: గురువారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో తహసీల్దార్ జెట్టి విజయశ్రీ మాట్లాడుతూ గ్రామపరిధిలోని భూ సంబంధిత సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించాలన్న ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రైతులు తమ సమస్యల్ని గ్రామసభలో దరఖాస్తు చేసుకుంటే వాటికి రశీదు ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. మండల, గ్రామస్థాయి రెవెన్యూ, సర్వేయర్లు స్థానికంగానే వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న తరుణంలో తప్పక రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామసభలో మూడు దరఖాస్తుల్ని స్థానిక రైతులు రెవెన్యూ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం జయరాజు, సర్పంచ్ పుల్లగూర ప్రభావతి, రెవెన్యూ మండల సర్వేయరు గేరా సురేంద్రనాథ్, వీఆర్వో కొల్లి జగన్‌మోహన్‌రావు, గ్రామసర్వేయర్ ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో గురువారం తహసీల్దార్ పి.నిర్మల అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు 11 మంది రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. 5 అర్జీలు ఆన్‌లైన్ అడంగల్‌లో తమ భూములను నమోదు చేయాలని, మరో 5 అర్జీలు పొలాల సర్వే కోసం, మరోక అర్జీ తమ భూమిని సబ్ డివిజన్ చేయాలని అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ రవికుమార్, వీఆర్వో రామకృష్ణారెడ్డి, గ్రామ సర్వేయర్ గోపిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభకు ఇరవై అర్జీలు

నాదెండ్ల: సంకురాత్రిపాడు గ్రామ సచివాలయం వద్ద రెవిన్యూ గ్రామ సభ నిర్వహించారు. సభకు ఇరవై అర్జీలు అందాయి. తహసీల్దార్ ఏవీ రమణ, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మీ, మండల సర్వేయర్ రాంబాబు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు హాజరయ్యారు. రైతుల నుంచి ఇరవై అర్జీలు అందాయి. రీసర్వేలో భూముల కొలతల్లో తేడాలను సరిచేయాలంటూ, పాసుపుస్తకాలు కావాలంటూ అర్జీలు అందించారు.

అర్జీలకు రుసుముల్లేవు

వినుకొండ(నూజెండ్ల): రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీలకు ఎలాంటి రుసుం చెల్లింపులు లేవని తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ అన్నారు. గురువారం నూజెండ్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ భూవివాదాలకు తావులేకుండా ఉండటానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో భావితరాలు వారందరూ ఇబ్బందులు పడకుండా ఉంటారన్నారు. అనంతరం 5 దరఖాస్తులు కొలతలు, 6 అర్జీలు మ్యూటేషన్ కొరకు రైతులు తహసీల్దారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈ.అంజమ్మ, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు కె.బాల వెంకటేశ్, వీఆర్వో దూదెకుల నాసర్‌సాహెబ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నీటికుళాయిల మంజూరుపై ఫిర్యాదు

నాదెండ్ల: చందవరం గ్రామానికి చెందిన యన్నం రమణారెడ్డి ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో లక్ష్మణరావు గురువారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామంలో నీటి కుళాయిల మంజూరులో అవకతవకలు జరిగాయంటూ యన్నం రమణారెడ్డి ఫిర్యాదు చేశారు. గతంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన జంగు జరీనా, కాంతారావు, షాహిదాలను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయనతో పాటూ ప్రస్తుత కార్యదర్శి మధు ఉన్నారు.

చెల్లని చెక్కు కేసులో మూడు నెలల జైలు

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రవల్లిక గురువారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన సి.హెచ్. గీత లక్ష్మీ వద్ద 22 డిసెంబర్, 2018లో రూ.2.5 లక్షల రూపాయలు పేరేచర్లకు చెందిన మస్తాన్ వలి అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా చెక్కును అందజేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. నేరం రుజువు కావటంతో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష విధించారు.